# రివర్స్ గేర్

ప్రపంచ ప్రఖ్యాత చిత్రకారులు బాపు తన కార్టూన్లలో అధిక బాగంలో లావుపాటి భార్య చీర కట్టుకుని కళ్ళెర్ర చేసుకుని తన ఎదురుగా భయం భయంగా, వినయ విధేయతలలో నిలబడి వున్న బక్కగా ఉన్న భర్తలను చిత్రించి భలే నవ్విస్తుంటారు. అయితే చెలపతి దంపతులు మాత్రం అలా ఉండరు. అతను పెళ్ళికి ముందు చాలా బొద్దుగా వుండేవాడు. చాలామంది వినాయకుడు అని ఎగతాళి చేస్తుండేవారు. వీడికి భార్య ఎలా దొరుకుతుందా అని అతని తల్లిదండ్రులు ముఖ్యంగా అతన్ని గారాబంగా చూసుకునే బామ్మ బోల్డు దిగులు పడిపోయేవారు.

అతనికి వచ్చిన సంబంధాలలో ఎక్కువ మంది సన్నగా ఉన్న అమ్మాయిలే కనిపించేవారు. కుదరని సంబంధాలతో అమ్మాయి తల్లిదండ్రులు పెళ్ళికొడుకు కొంచెం మందంగా ఉన్నాడనీ, కొంత మందైతే అమ్మాయి భయపడుతోందని అన్నారు. ఎలాగైతేనేం పెళ్ళిచూపుల్లో చెలపతిని చూసి బక్కగా ఉన్న ఒక అమ్మాయి ధైర్యం చేసింది. అప్పుడు పెళ్ళిచూపుల్లో చెలపతి ప్రక్కనే కూర్చుని వున్న అతని బామ్మ వెంటనే ఆ అమ్మాయి దగ్గరగా వెళ్ళి ఆమె బుగ్గలు సున్నితంగా చిదిమి "మనవరాలా మా చెలపాయ్‌ని చూసి కంగారు పడకుండా మంచి నిర్ణయం తీసుకున్నావే. చూడడానికి అలా మినపకుడుంలా కనిపిస్తాడు గానీ చాలా మంచోడే, మెత్తని మనిషి, నిన్ను సుఖపెడతాడే, పిచ్చిపిల్లా.." అంది.

ఆ అమ్మాయేమో "అందుకే గదా చేసుకుంటున్నాను, నాకు ఇలాంటి మెత్తనోడే కావాలి" అనుకున్నట్లుగా బామ్మకు వినిపించిందేమో.

"మావోడిని జాగ్రత్తగా చూసుకోమ్మా, వాడికి కొంచెం తిండి ధ్యాస ఎక్కువనుకో.." అంది ఈ సారి కొంచెం గట్టిగా ఆమెకు మాత్రమే వినిపించేటట్లుగా. వెంటనే ఆ అమ్మాయి "బామ్మగారూ నేను ఆయన్ని కంట్రోల్ చేసి, నాలాగా స్లిమ్‌గా చేసి చూపిస్తానుగా" అందామెతో. "నాతల్లే నా ఆయుష్షు కూడా పోసుకుని నిండునూరేళ్లు బ్రతుకు తల్లీ" అనేసింది సంబరంతో బామ్మ.

అంతే వాళ్ళకి పెళ్ళయిపోయింది.

"కాళిందీ నువ్వు భలే అందంగా ఉన్నావ్" అన్నాడు చెలపాయ్ మొదటిరోజు. ఆమె అదోలా చూసిన చూపులో 'టామ్ అండ్ జెర్రీ' ఫిల్మ్‌లో టామ్‌ని ముప్పతిప్పలు పెట్టే

జెర్రీ 'నీ పని అయిపోయిందిలే' అన్నట్లుగా టామ్‌ని చూసిన చూపులా గోచరించింది. అంతే ఆ రోజు నుండి చెలపతి జీవితంలో సంసార సుఖంతో పాటు సతీసాధింపు కూడా మొదలైంది.

ఆమె ఏం చెబితే అది వినాలి తనకు కావాల్సిన పని ఏం చెప్పినా చేయదు. ఏదైనా తినేవి ఇష్టం అని చెబితే "ఇంకా బలిసిపోతారు, చాల్లే, నేను పెట్టింది తినండి. మీ బామ్మకు మిమ్మల్ని పీలగా చేసి చూపిస్తానని శపథం చేశాను. మగ పెత్తనం చెయ్యాలని ప్రయత్నించకండి. నేను సామాన్యురాల్ని కాదు" అని ఆమె అంటుంటే "ఇవ్వాళ వంటేంచేయమంటావ్" అని చేతిలో గరిటితో తలవంచుకుని నిలబడ్డ బక్క భర్త ముందు మిడిగుడ్లతో గుర్రుగా చూస్తున్న గంప గయ్యాళి పీపాలాంటి భార్య" ఉన్న బాపుగారి కార్టూన్ గుర్తుకు వచ్చింది చెలపాయ్‌కి. గిలగిల్లాడిపోయాడు.

సన్నగా పీలగా లంగా వోణిలో బాపు బొమ్మలా ఉన్న కాళిందిని "మన పర్సనాలిటీతో డామినేట్ చేసి సుఖంగా ఉండొచ్చని" వెడ్డింగ్ లుక్కింగ్స్‌లో అనుకున్నాడుగాని తన బ్రతుకు ఇలా కాలిపోతుందని అనుకుంటున్న భర్తను "ఏమిటా పిచ్చి చూపులు?" అని కసిరింది కాళింది. పెళ్ళయి సంవత్సరం దాటుతోంది, పాపం చెలపతికి కాళిందితో బాధలు శృతిమించిపోతున్నాయి. కాళికా అమ్మవారిని కూడా స్మరించుకున్నట్లుగా ఉంటుందని పెళ్ళాన్ని ముద్దుగా పిలుచుకున్నట్లుగా కూడా ఉండి ఉభయతారకంగా ఉంటుందని పెళ్ళయిన కొత్తలో "కాళీకాళీ" అని పిలుచుకునేవాడు. తనకేం తెలుసు ఈమె సాక్షాత్తు కాళికావతారమని?.

ఒకరోజు పేపరు చూస్తోంటే ఒక ప్రకటన అతన్ని విశేషంగా ఆకట్టుకుంది. తన చిన్ననాటి స్నేహితుడూ, తమకు దూరపు బంధువూ అయిన సైక్రియాటిస్ట్ శేషు, హాస్పిటల్ ప్రకటన. ఆర్నీ భలే ఉపాయం దొరికింది. కాళిందిని ఎదుర్కోవాలంటే సైకలాజికల్‌గా ఏదో ఆలోచించాలే తప్ప మరో మార్గం లేదు. శేషుని సంప్రదించి ఏదో ఉపాయం ఆలోచించాలి. అప్పుడుగాని తన బాధలకు అంతు ఉండదని అనుకుంటూ కులాసాగా లలలా లలలా అనుకుంటూ "కాళీ భోజనం పెట్టు.." అన్నాడు గంభీరంగా.

"ఇవాళ ఆదివారం కదా అప్పుడే పిండాకూడుకు ఏం కంగారు? ఎప్పుడూ బొక్కేదే కదా? కాస్త ఆలస్యంగా మింగండి, ఎలాగూ ఆ తర్వాత గుర్రు పెట్టి నిద్రపోవడమేగా?" అంది కాళీ. అంతే! నోటికి టేప్ అంటించినట్లుగా సైలెంటైపోయాడు.

ఆ వేళ సాయంత్రం భార్య సినిమాకు వెళ్దామని పట్టుబట్టినా సరే 'ఎలాగైనా ఈ రోజు నుండి దీన్ని కంట్రోల్‌లో పెట్టాలి" అనే తీవ్ర నిర్ణయానికి వచ్చేసి చాలా రోజుల తరువాత భార్యను సూటిగా చూస్తూ "నాకు సాయంత్రం ముఖ్యమైన పని వుంది" అన్నాడు.

"నాకన్నా ముఖ్యమైనదా?" అంది కోపంగా. "అవును" అని వెనక్కి తిరిగి చూడకుండా బెడ్ రూమ్‌లోకి వెళ్లిపోయాడు. ఏమిటీ మనిషి ఈవేళ ఇంత బరితెగించి మాట్లాడుతున్నాడనుకుని, గమ్మున ఊరుకుంది.

సాయంత్రం పెళ్ళానికి చెప్పకుండా డాక్టర్ శేషు ఇంటికి వెళ్ళాడు. "అరెరె చెలపాయ్ ఎన్నాళ్ళైంది నిన్ను చూసి, ఉద్యోగం మానేసి క్లినిక్ పెట్టే హడావిడిలో నీ పెళ్ళికి రాలేకపోయానురా సారీ.." అన్నాడు డాక్టర్ శేషు సంతోషంగా – "అవునులే నువ్వెందుకు వస్తావ్, నీ పేషెంట్లే నీ దగ్గరకు వస్తారు కదా?"

"అదేంట్రోయ్, అలా అంటున్నావ్. కొంపదీసి పెళ్ళయ్యాక నా పేషెంట్‌వి అయ్యావా ఏమిటి?" అంటూ సాగదీసి ఒక్కో మాటా వ్యంగ్యంగా అంటోన్న, శేషుని చూస్తూ కాళి పెళ్ళి చూపుల నుండి జరిగిన తతంగం తుచ తప్పకుండా విచారవదనంతో తన గోడు చెప్పుకున్నాడు. చిరునవ్వులతో వింటున్న శేషుని చిరుకోపంతో చూస్తూ "పిల్లికి చెలగాటం ఎలక్కి ప్రాణ సంకటం" లా ఏమిటిరా, నేనేమో జీవిత సమస్యతో వస్తే నన్ను అలా ఆనందంగా చూస్తున్నావ్?" అన్నాడు చెలపతి.

"అవునూ, మీ ఆవిడ పేరేమిట్రా.." అని అడిగాడు శేషు. అందుకు చెలపతి తల వంచుకుని "కాళింది. నేను ముద్దుగా కాళీ అని పెళ్ళయిన కొత్తలో పిలిచానులే, నా పాలిట కాళి అయి కూర్చుంది ఇప్పుడు" అంటూ దీనంగా చెబుతున్న తన మిత్రుని భుజంపై చేయివేసి.

"బి బ్రేవ్ మేన్, పెళ్ళయిన కొత్తలో భార్య మీద మోజులో పడి ఆమెకు లోబడిపోయినట్లుగా, ఆమే సర్వస్వం అన్నట్లుగా మగాళ్ళు ప్రవర్తిస్తారు అలా కాకుండా జెంటిల్‌మేన్ లాగా, హీమేన్ లాగా ప్రవర్తించాలి. తల ఎత్తి మాట్లాడాలి. తలవంచుకున్నావో, నీ పని మటాష్!" అంటూ తన మిత్రునికి అనేక సలహాలు ఇచ్చి పంపిస్తూ "మా శ్రీమతితో మీ ఇంటికి వస్తాంలే, ఆల్ ది బెస్ట్" అంటూ మిత్రుణ్ణి పంపించాడు.

మర్నాడు సోమవారం ఉదయాన్నే బెడ్ మీద నుండి లేచి ధైర్యలక్ష్మికి నమస్కరించి ఆమెకు ఉన్నంత అపారమైన ధైర్యాన్ని ప్రసాదించమని ప్రార్థించి "కాళీ" అన్నాడు సీరియస్‌నెస్ తెచ్చుకుని. "ఏమయిందీ" అంటూ విసవిసా ముఖం నిండా కోపంతో వచ్చి అతని సరసన కూర్చోబోతుంటే "ష్.. అలా ఎదురుగా నిలబడు నీకు కొన్ని విషయాలు చెప్పాలి" అన్నాడు.

"మీకేమయింది ఇవాళ" అని ఆమె అంటూ ఉంటే కుడి అరచేయి ఆమె వైపు పెట్టి "నేను ఈ వేళ నుండి ఈ ఇంటి యజమానిగా ఉండాలని అనుకుంటున్నాను" అన్నాడు. "మరి ఇన్నాళ్ళూ ఎవరు?"

"ష్..నేను చెప్పేది వినడమే నీ పని, మారు మాట్లాడకు" అని గద్దించాడు. "ఈ రోజు నుండి నేను చెప్పేది వేదం. నేను చెప్పిన టిఫిన్ చెయ్యాలి. మధ్యాహ్నం నేను చెప్పిన వంటకాలే చేయాలి. రాత్రికి మళ్ళీ నాకు ఇష్టమైన వంటకాలు వేడి వేడిగా చేసి డిన్నర్ అరెంజ్ చేయాలి, మారు మాట్లాడకుండా ఆ తరువాత తాంబూలం ఇవ్వాలి గోముగా. సాయంత్రం ఇంటికి వచ్చేక నాకు పన్నీరు కలిపిన నీళ్ళు ఏర్పాటు చేసి, ఆ తర్వాత లాల్చీ పైజమా అందివ్వాలి. ఆ తరువాత నువ్వు కూడా స్నానం చేసి తెల్లచీర మల్లెపూలతో నాకు పడకగదిలో స్వాగతం చెప్పాలి. ఆ తరువాత విషయాలు నీకు చెప్పనవసరం లేదనుకుంటాను. మన సంసారంలో ఏ విషయంలోనైనా డెసిషన్ మేకర్ని నేనే తెలిసిందా? నాకు ఎదురు చెప్పనేకూడదు అండర్‌స్టాండ్?" అంటూ తన చూపుడు వేలు చూపిస్తూ మాట్లాడుతున్న భర్తను చూస్తూ.

"ఆ తరువాత? ఇంకేం చేయాలి? ఇవాళ మీకు ఏమయింది? నిన్నటి దాకా బాగానే ఉన్నారుగా? అయినా ఏదో తేడాగా ప్రవర్తిస్తున్నారే.. మా బావ సైక్రియాటిస్ట్. ఈ ఊళ్ళోనే హాస్పటల్ పెట్టాడట. నిన్న రాత్రి ఫోన్ చేశాడు. సాయంత్రం మనం ఇద్దరం అతని దగ్గరకు వెళ్దాం. ఒకసారి మిమ్మల్ని కంప్లీట్‌గా టెస్ట్ చేయమంటాను, ఏదైనా తేడా వస్తే షాకులిస్తాడు. అంతే! సెట్ అయిపోతుంది." అంటున్న ఆమెను అదోలా చూస్తూ.

"ఎవరాయన?" అన్నాడు లోగొంతుకతో. "ఆయనా? మా మేనత్త కొడుకు డాక్టర్ శేషుకుమార్, పాపం నన్ను చేసుకుంటానని మోజు పడ్డాడు. డాక్టర్‌తో ఏం సంసారం చేస్తావే, నీబొంద ఎప్పుడూ పేషంట్లూ, రోగాలు అంటూంటాడు. పైగా పిచ్చి డాక్టర్ కూడానూ అన్నారు. ఇతనైతే గవర్నమెంట్ ఉద్యోగం పనీపాటా ఉండదు. నువ్వు ఏం చెప్పినా వింటాడు. ఇక కొంచెం లావుగా ఉన్నాడనుకో, కొన్నాళ్ళు తిండి కంట్రోల్ చేశావనుకో ఏనుగు పీనుగులా తయారైపోతాడు. అయినా కదివడంత గుమ్మడి కాయ కత్తిపీటకు లోకువ అంటారు కదా అలాగే నువ్వు కత్తిలా ప్రవర్తించాలే పిచ్చి మొద్దా అన్నారు మా వాళ్ళు. అందుకని శేషుని చేసుకోలేదు పాపం" అంటూ ధారాళంగా చేతులు తిప్పుకుంటూ మాట్లాడుతూ మాట్లాడుతూ చెలపతిని చూసి నవ్వుతూ చెప్పింది.

అదోలా నవ్వుతూన్న భార్యను చూసి "ఏరా ఇంకా ఏం దొబ్బేశావ్? ఆ ఇంట్లో నువ్వేం దొంగతనం చేశావో మాకు తెలుసు రా దొంగెదవా" అంటూ తనను కుళ్ళబొడుస్తున్న సబ్ఇన్‌స్పెక్టర్‌ని చూస్తున్న దొంగలా భయం భయంగా చూస్తున్నాడు, "ఈ శేషు కుమార్ ఈ ఊళ్ళోనే హాస్పటల్ పెట్టాలా" అనుకుంటూ కారు ముందుకు వెళ్ళకుండా వెనక్కి నడవడం అంటే ఇదేనేమో, వెధవ జన్మ ఇక ఇంతే అనుకుంటున్నాడు పాపం చెలపాయ్. ●

(స్మైల్ ప్లీజ్ నవ్వండి, మంత్లీ, సెప్టెంబర్ 2011)